# ఆటబొమ్మ విరిగిపోయింది

(ఆంధ్రభూమి - 13-8-81)

---

ఒక భర్తృవిహీన తమ కాలక్షేపానికి ఆటబొమ్మ కాకూడదు.

—జయప్రద

---

విమల చాలా ఆనందంగా ఉంది. లేచి గంతులు వేయాలన్నంత ఉషారుగా వుంది.

ఈరోజు తన స్నేహితురాలూ, వదిన అయిన అమూల్యకు మరలా పెళ్ళయింది. ఆమె బ్రతుకు చిగురించింది. ఎంత సంతోషమైన విషయం ఇది!

ఈ విషయం తెలిసి ఎంతమంది సంతోషిస్తారో, ఎంతమంది తేలిగ్గా నిట్టూరుస్తారో!

"పాపం అమూల్య బ్రతుకు మూడు నెలలకే నట్టేట్లో మునిగి పోయింది" అని ఎంతమంది ఆ పిల్ల బ్రతుకును గురించి సానుభూతి చూపించేవాళ్ళు?

పాపం వాళ్ళంతరికీ ముందుగా చెప్పుంటే పెళ్ళికి వచ్చుండే వాళ్ళు.

కాని తమ దగ్గర బంధువులు, పరమ చాంధసులు 'ఏ జన్మలో ఏం పాపం చేసిందో ఈః జన్మలో ఇలా వంచించబడింది' అని అమూల్య జీవితానికి సంజాయిషీ యిచ్చి మౌనంగా వుండిపోయే మూర్ఖులు.

వీళ్ళు తమ రక్త సంబంధీకులు. వీళ్ళను పిలిస్తే పెళ్ళిజరగదు. వీళ్ళని పిలవకుండా అమూల్య గురించి బాధపడి, సానుభూతి చూపించి ఆ పిల్ల ఆనందంగా వుంటే చూడాలనుకున్న వాళ్ళని పిలిస్తే వాళ్ళ మధ్య రాజకీయాలుద్భవిస్తాయి-అందుకే ఎవర్నీ పిలవలేదు.

రేపే వాళ్ళకు చెప్పేయాలి. వెళ్ళి అందరికీ చెప్పి వాళ్ళ కళ్ళలో ఆనందాన్ని, ఆ కళ్ళ మెరుపులో ప్రశంసను చూడాలి.

అలా అనుకుని ఆనందపడుతున్న విమల గుండెల్లో ఆరేళ్ళ సంఘటనలు గుసగుసలాడాయి.

విమల, అమూల్య స్నేహితులు.

ఒకరి మనసు ఒకరు నొప్పించుకోని స్నేహితులు.

వాళ్ళ స్నేహంమధ్య అలకల్లేవు.

నిష్టూరాల్లేవు.

దెప్పిపొడుపుల్లేవు.

ఎదుటి వ్యక్తి తనకిష్టంలేని పనిచేసినా ఎలాటి పరిస్థితులలో చేసినదో అనే అవగాహనతో కూడిన స్నేహం వాళ్ళది.

అమూల్యది చాలా పేద కుటుంబం.

విమలది మధ్యతరగతికంటే ఓ మెట్టు పైనున్న కుటుంబం. అయినా అమూల్య అందం భాస్కర్ జీవితంలోకి ఆమె ప్రవేశించేలా చేసింది.

భాస్కర్ విమల అన్న. గవర్నమెంట్ సర్వెంట్. మరో మూడు నెలలు భాస్కర్ పెళ్ళికి తొందరపడకుండా వుండుంటే అమూల్య జీవితంలో ఇన్ని ఘట్టాలుండేవి కావు. అందరి ఆడపిల్లల్లా ఆ పిల్ల జీవితమూ సాఫీగా జరిగిపోయుండేది.

పెళ్ళి అయిన మూడు నెలలకే సరిగ్గా అదే తేదీ పొలంగట్టుమీద నడిచొస్తున్న భాస్కర్ పాముకాటుతో, ఎలాటి సహాయమూ అందక ముందే అక్కడికక్కడే మరణించాడు.

భాస్కర్‌ని పాము కరిచింది. అమూల్యని సమాజం కరిచింది-మనం నమ్మే దేముడు ఆమెకు విధించిన శిక్ష భాస్కర్ మృతిచెందాడు.

ఈ సమాజం ఆమెకందించిన శిక్ష-ఒంటరి ఆడదాన్ని ఆటబొమ్మనుచేయడం-నిజం నిజం అందరికీ పబ్లిక్ ప్రాపర్టీ అయిపోయింది.

విమల బలవంతంవలన అమూల్య ఒంటిమీద రంగుబట్టలు, నుదుటిమీద సింధూరం చెరిగిపోలేదు-కానీ ఆ పిల్ల ఒంటరిగా మిగిలిపోయింది. విమలకు భాస్కర్‌కంటే ఒక సంవత్సరం ముందే పెళ్ళయిపోయింది.

అన్న చనిపోయిన ఓ నెల తర్వాత తన అత్తగారింటినుండి ఒత్తిడి రావడంతో అక్కడికెళ్ళిపోతూ అడిగింది విమల.

"అమూల్యా! నువ్వూ నాతో రాకూడదూ?"

అభిమానంగా నవ్వేసి వూరుకుంది అమూల్య.

"పోనీ మీ అన్నయ్య దగ్గరి కెళతావా?"

వెళ్ళనన్నట్టు తలూపింది అమూల్య.

"ఎలా....? మరెలా వుంటావు.... ఒక్కదానివే. నేనుకూడా లేకుండా?"

అమూల్య శుష్కంగా నవ్వింది.

"ఇక ఇది తప్ప మరే మార్గమూ లేదనుకున్నప్పుడు.

'ఎలా వుంటానూ?' అని ప్రశ్నించుకుని బాధపడడం అవివేకం కదూ విమ్మీ!"

విమల ఆలోచించింది.

"ఉహూఁ నువ్వు ఇలా ఒకదానివే వుండ కూడదు. చూడూ అన్నయ్య ఆస్తులంతా లెక్కలు చూసుకుని ఇల్లూ, పొలం అంతా అమ్మేసి నీ పేరన ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసుకుని నువ్వు మీ అన్నయ్య దగ్గర కెళ్ళు. డబ్బున్నప్పుడు అందరూ బాగానే చూస్తార్లే నీ ఖర్చులు నువ్వే పెట్టుకో....నీ కష్టానికి, ఓదార్పుకి నీ స్నేహితురాలిగా నేనున్నా నని మర్చిపోకు. నీ జీవితాన్ని ఇంకెలా అయినా మార్చుకుంటే బాగుం టుందని నీ కన్పిస్తే ఒక్క కార్డు వ్రాయి. అన్నీ చేసి పెట్టడానికి నేనున్నాను."

విరక్తిగా నవ్విందీ సారి అమూల్య.

"వద్దు....వద్దు విమలా. నా కంత అదృష్టం లేదు. అందరు అన్నలూ భాస్కర్‌లు కారు, ప్రేమించేచోట నేను ప్రాణం ఇస్తాను. బానిసగా భావిస్తే మాత్రం నా మనసు ఎదురు తిరుగుతుంది. ఆ తర్వాత పరిణామాలు బాగుండవు."

అలా నిర్ణయించుకుని ఆ ఇంట్లోనే వుండిపోయి ఒక రకంగా అమూల్య పొరపాటు చేసిందనే అనాలి. అండలేని అమూల్య అందరికీ కాలక్షేపపు వస్తువయిపోయింది.

ఆడదానికీ కోరికలుంటాయనీ, వాటిని తీర్చుకోను మరో మార్గం చూచుకుంటారనీ సిద్ధాంతీకరించి, ఊహాగానాలు చేసి ఆ పిల్ల బ్రతుకును అల్లరిపాలు చేసి, ఆమె నైతిక జీవితానికి మురికి అంటగట్టింది ఈ ఈ సమాజం.

అంతవరకు ఎంత దూరం చెప్పినా, ఎలా నచ్చజెప్పినా, రెండో పెళ్ళికి ఒప్పుకోని అమూల్య ఈ అపనిందలకు భయపడి విమలకు మాటిచ్చేసింది.

"విమ్మీ! ఎవరినయినా చూడు. దోవనపోయే ఏ దానయ్యయినా పర్వాలేదు. నాకిప్పుడు అర్జంటుగా పెళ్ళికావాలి. లేకపోతే నా వల్ల కాదు. ఇలాంటి నికృష్టపు మాటలు వింటూ నేను బ్రతకలేను.... చెప్పు చేస్తావా?"

విమల మొదట బిత్తరపోయింది. ఈ అపవాదులన్నీ ఆ నోటా, ఈ నోటా వింటూనే వుంది విమల కూడా. కానీ నమ్మలేదు అమూల్య ఏమిటో విమలకు తెలుసు.

ఒక రకంగా విమల ఈ అపవాదులు వేసిన మనుషులకు థాంక్స్ చెప్పుకుంది.

లేకపోతే అమూల్య మూర్ఖంగా తన జీవితాన్ని అలానే వ్యర్థ పరుచుకుని వుండేది.

విమల ఎక్కువ శ్రమపడకుండానే అమూల్యకు తగిన మనిషి దొరికాడు. సుబ్బారావు ఎవరికీ తెలియని మనిషి కాదు. అమూల్య మీద వచ్చిన అపవాదులు ఎరగని వాడు కాదు. సుబ్బారావు మరో విమల.

తన బంధువుల్లో అందరికీ తెలిసిన యోగ్యుడిగా అమూల్య ప్రక్కన అతన్ని చూసి అందరూ సంతోషిస్తారనుకుంది విమల.

పిల్లి కాబోలు ఏదో తోసేసింది. గిన్నెలు గలగలల శబ్దానికి ఉలిక్కిపడింది విమల.

పచ్చటి జీరో వాల్ట్ బల్బ్ కాంతిలో ఆ రూమ్‌లో వస్తువులు స్పష్టాతిస్పష్టంగా కన్పిస్తున్నాయి.

ప్రక్కగదిలో సుబ్బారావు మాటలు విన్పిస్తున్నాయి. అమూల్య గొంతులో నుండి ఎలాటి శబ్దంలేదు.

చేదు గతంలోనుండి వర్తమానంలో కొచ్చిన విమలలో మరలా గంతులేసే ఆనందం-ఉరకలేసే కుతూహలం.

ఈ విషయం తెలిసి శేషు వదిన ఏ మానందిస్తుందో! తనకు ముందుగా చెప్పలేదని ఎన్ని నిష్ఠూరాలేస్తుందో.

ఆమె అనేదెప్పుడూ "మనకంటూ ఓ తోడు వుండాలి కానీ ఈ అన్నదమ్ములు శాశ్వతమా విమలా" అని. పాపం శేషు వదిన భర్త కూడా ఈ మధ్యే చనిపోయాడు.

పాపం అమ్మమ్మకు కూడా చెప్పాలి. ఆ మధ్య బాధపడింది "ఇలా అమూల్యమ్మను ఒంటరిగా చూస్తుంటే గుండె తరుక్కుపోతోందే విమలా. నా సంసారంతో నాకు సరిపోతోంది. నా కూతురు, అల్లుడు లేకపోతే మాత్రం నేను లేనూ.... ఈ లంపటం వదిలించుకుని అమూల్యమ్మ దగ్గర కెళ్ళి వుండాలనుకుంటున్నానే."

"ఆ అవసరం, ఆ శ్రమ నీకింకలేదులే అమ్మమ్మా" అని చెప్పాలి పాపం.

అమూల్య అన్నకూడా ఎన్ని సార్లనలేదు తనతో "ఏదో చాలీ చాలనిసంసారాలు విమలా. లేకపోతే అమూల్య దగ్గర ఇలా అడపాదడపా డబ్బు తీసుకునేవాణ్ణా. ఏమిటో ఆ అమ్మాయి దగ్గరనుండి సహాయం తీసుకోవడమేగానీ, ఆ పిల్ల ఋణం తీర్చుకునే అవకాశం నాకు రావడం లేదు" అని.

ఇప్పుడు చెప్పాలి "నీ కిప్పుడు ఆ అవకాశం వచ్చింది మురారీ-కాదంటున్న ఈ బంధువుల్ని ఎదిరించి నువ్వు నీ చెల్లెలికి కాస్త ధైర్యం ఇస్తూ నిలబడాలి" అని.

"నాకు ముందుగా చెప్పుండాల్సింది నేను నడుంకట్టి పెళ్ళి చేయాల్సిన వాణ్నికదూ!" అని బాధపడతాడు పాపం.

ఎక్కడ వీలయింది ఒకర్ని పిలిస్తే ఇంకొకర్ని పిలవలేదని నిష్ఠూరాలేస్తారు. కథలు సృష్టిస్తారు. అందుకే ఇద్దరు స్నేహితుల సంత

కాలతో రిజిస్టర్ పెళ్ళి చేసేసింది రోజు. నెలరోజులుగా ఈ విషయం రహస్యంగా పెట్టి.

మొన్నటికి మొన్న పారిజాతం పిన్ని తన కూతురికి పెళ్ళిచేస్తూ ఎలా బాధపడిపోయింది. అమూల్యకు బొట్టు పెట్టి పిలవడానికి లేకపోయెనే విమలా అని - ఇప్పుడు నీకా బాధలేదు పిన్నీ రెండో కూతురు పెళ్ళికి అమూల్యను బొట్టు పెట్టి పిలవచ్చు" అని చెప్పాలి.

మామయ్య పాపం చాలా దూరాన వున్నాడు. ఈ విషయ వింటే సంతోషిస్తాడు.

పాపం ఒంటరిగా రాత్రిపూట ఎలా పడుకుంటుందో? భర్త డొక్కలో ఒదిగి పసి బిడ్డను డొక్కల్లో వుంచుకుని పడుకోవాల్సిన వయసు" అనేవాడు.

రోజా ఆ వైపుగా కాలేజీ నుండి వస్తూ తన ఆడబిడ్డ అనేది.... పాపం వదినా! మీ ఇంటి వైపు చూస్తే గుండె తరుక్కుపోతుందనుకో.... ఎప్పుడూ ఆ వాకిట తలుపువేసే వుంటుంది. అమూల్యక్క ఒంటరిగా అంత ఇంట్లో ఏ మూల వుంటుందో?

ఇప్పుడు తను చేసిన పనికి సంతోషిస్తుంది సుజాత. ఎట్లాయినా చదువుకున్న పిల్ల భావాలు విశాలంగానే వుంటాయి.

అవి ఆలోచిస్తూ, ఆనందిస్తూ, పరవశిస్తూ నిద్రలో కొరిగిపోయిన విమల కళ్ళు తెరిచే సరికి నీ రెండ ఆ గదినంతా ఆక్రమించుకోనుంది. అమూల్య కడిగిన ముత్యంలా తయారయి, తనని లేపడానికొచ్చి ఎదురుగా నిల్చుని సిగ్గుగా, సంకోచంగా చూస్తోంది.

* * * *

కొన్ని రోజుల తర్వాత ఓ రాత్రి డాబామీద వెన్నెట్లో భర్త ఛాతీమీద తల వుంచి ఆతన్ని అల్లుకుపోయిన విమల గుండెల్లో అర్థం కాని ఆరాటం. విదిలించుకున్నా అల్లుకుంటున్న ఆవేదన.

ఎందుకిలా తన అంచనాలు తారుమారయ్యాయి శేషు వదిన ఏమంది?

"మన తోడు అంటూ మన కుండాలిగానీ ఈ అన్నదమ్ములు శాశ్వతమా? విమలా" అన్న శేషు వదిన ఏమంది?

"ఏ జన్మలో చేసుకున్న కర్మమో మన వస్తువు చేజారిపోయింది అట్లాని మరలా పెళ్ళి చేసుకుంటామా?" అంది.

తన కూతురి కోడలి వంటరితనానికి బాధపడ్డ అమ్మమ్మ ఏమంది?

"తోడులేరని ఇలాంటి అప్రాచ్యపు పనులు చేస్తారా? నాబోటి దెవతో వచ్చి వుండమంటే వుండకపోయిందా? అందరూ పెద్దలయి పోయారు" అంది తనవైపు గుర్రుగా చూస్తూ.

పోనీ మురారి అయినా సంతోషిస్తాడనుకుంది కానీ అతని ముఖంలో ఆనందం లేదు. పైగా అవమానించబడ్డ భావం. తను చేయ లేని పని మరెవర్తో చేసారని.

చిగురించిన తన చెల్లెలి కొత్త సంసారాన్ని చూడ్డానికింతవరకు రాలేదు. ఎంత కఠినుడో! ఇంతకీ అతన్ని పిలవక అవమానం చేసారట తన చెల్లెలి బ్రతుకు చక్కబడాలిగానీ ఆమె బ్రతుకును ఎవరు చక్క బరిస్తే ఏం? ఈ సంకుచితత్వాన్ని ఏమనాలి? స్వార్ధమనా? అభిమాన జాడ్యమనా?

పారిజాతం పిన్ని మాత్రం ఏం సంతోషపడిందనీ! నా కెందు కులే అన్నట్లు వూర్కొంది. ఇది అందరూ ఆనందించాల్సిన సంగతి కాదూ! ఆమె కూతురు పెళ్ళయ్యాక ఇద్దరినీ ఇంటికి పిల్చి అమూల్య డిన్నరు ఇవ్వలేదూ! కనీసం ఆ కొత్తజంటను ఆశీర్వదించడానికి ఒక్క సారి వచ్చిపోకూడదూ?

మామయ్యకు తను జాబు వ్రాసింది. అతని దగ్గర నుండివచ్చిన రిప్లయ్ తనని ఏమీ సంతోషపర్చలేదు.

"సుబ్బారావు కాకుండా ఇంకా స్త స్టేటస్ వున్నవాణ్ని చూసుంటే బాగుండేది. మరీ అతను బడిపంతులు.

ఎవరు? ఎవరు చూస్తారు? అసలెవరు ప్రయత్నించారు. అమూల్యకు పెళ్ళి చేయాలని? ఆ పిల్ల భర్త చనిపోయినందుకు తమ బాధను కడవల్తో వ్యక్తం చేసారే తప్ప, పాపం అమూల్య రాత్రి ఒంటరిగా ఎలా పడుకుంటుందో అనుకున్న వ్యక్తి అమూల్యకు కాస్త హోదా వున్న వాడయితే బాగుండేది అన్న మనిషి దాని కొరకెప్పుడయినా ప్రయత్నించాడా? ఛీ ఏం మనుషులు!

చదువుకుని లెక్చరర్‌గా పని చేస్తున్న తన ఆడబిడ్డ ఏమంది?

"చేసుకుంటే చేసుకుంది ఆ అందగాణ్నా చేసుకునేది. ఏం సుఖ పడుతుంది? అతనితో" అంది పైగా "ఇలాంటి పెళ్ళిళ్ళు తప్పేమీలేదు. మా స్నేహితురాలు వత్సల తెలుసుకదా! ఆ పిల్ల కమ్మ కులస్థుణ్ణి ఇష్ట పడింది. వాళ్ళింట్లో వాళ్ళే పెళ్ళి చేశారు. అతనికేం డాక్టరు. బాగా సంపాయిస్తున్నాడు అందగాడు" అని జత చేసింది.

అతను తనకు తెలీదా అందగాడే. డాక్టరే. సంపాదనపరుడే కానీ ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్యను ఏం సుఖపెడుతున్నాడు? పరాయి ఆడవాళ్ళను ఇంటికే తెచ్చుకుంటున్నాడు.

ఆ విషయం సుజాతకు తెలుసు. అయినా అతన్ని సమర్థిస్తోంది. అంటే....అంటే భర్త భార్యను ఎంత హింసపెట్టినా లోకం కళ్ళకు అతను అందగాడై అంతస్థు వుంటే చాలా? యోగ్యుడైన సుబ్బారావుతో అమూల్య సుఖపడదా?

అసలు సుఖానికి నిర్వచనం ఏమిటి? దానికో రూపం వుందా? దానికో స్పష్టమైన ఆకారం వుందా? లేదు. ఎవరి మనసు దేన్ని కోరితే, దేనితో తృప్తిపడితే అదే సుఖం-

తన భర్తకు పది డిగ్రీలుండి నలుగురిలో శభాష్ అన్పించు కుంటే బాగుణ్ణనుకున్న భార్యకు అలాటి భర్తతో సుఖం.

భర్త అప్పులుచేసి తాగి తందనాలాడినా సరే తనకు కావాల్సిన నగలు, చీరలు కొనిస్తే చాలనుకునే ఆడదానికి సంపాయించిన దానితో గుట్టుగా సంసారంచేసే మగాడు భర్తగా దొరికితే అది ఆమెకు శాంతిని, సుఖాన్ని ఇవ్వలేదు. ఆమె సుఖమంతా ఆమె నగల్లో ఆమె చీరల్లోనే పొందుతుంది.

తన భర్త ఎప్పుడూ తనతోనే వుండాలని కోరుకునే భార్యకు అతను పరాయి వూరెళ్ళి పది లక్షలు సంపాయించినా దానితో ఆమె సుఖపడలేదు.

ఎదుటి వ్యక్తి కష్టాలకు స్పందించి తను సంపాయించే రెండొందలలో ఓ వంద దానం చేస్తే దొరికే సుఖం ఓ వ్యక్తికి టేబిల్ క్రింద చెయ్యిపెట్టి లంచాలు సంపాయిస్తే దొరక్కపోవచ్చు.

లంచాలు తీసుకుని మేడ కట్టాలని కోరికున్న వ్యక్తికి అందరి చేత ఛీ అనిపించుకున్నా సరే మేడ కట్టడంలోనే అతనికి సుఖం.

తన భర్తను ప్రేమించి అలా మిగిలిపోయిన పడతికి తన భర్తను పంచి యిచ్చే స్త్రీ మనకు విడ్డూరంగా కన్పించొచ్చు కానీ అది ఆమెకు ఆనందం. ఆ ఆనందం ఆమెకు సుఖం.

సుఖమనేది మన మనసు.

అంతేకాని యిలా వుంటేనే సుఖపడతావు అంటే అది అమాయకత్వం-

అమూల్యకు కావాల్సింది ఇప్పుడు రక్షణ. ఎప్పటికీ తనని వదలడనే భరోసా. అశాంతి పాలయిన తన మనసును మరింత నొప్పించడనే నమ్మకం.

అంతేగాని అతని సంపాదన, అందం కాదు. ఆమెకు కావల్సినవి సుబ్బారావులో పుష్కలంగా దొరికాయి. అమూల్య కోరుకున్నది ఆమెకు దొరికింది. సుజాత కోరుకుంది, మామయ్య కోరుకుంది కాదు దొరకాల్సింది.

తన అత్తా, మామ మొన్న ఏమన్నారు?–

"ఒరే నిన్ను పిలవకుండా నీ భార్య వాళ్ళ వదినకు పెళ్ళి చేసింది. నువ్వు వాళ్ళింటికెళ్ళకు" అన్నారు.

పాపం ఈయనెంత మంచివాడు!

"అది చాలా అనాగరికమమ్మా! ఎవరి ఇష్టాలు వాళ్ళవి. ఎవరి బ్రతుకులు వాళ్ళవి. ఆ అమ్మాయి పెళ్ళి చేసుకున్నందువల్ల మనకు జరిగిన నష్టం ఏమీలేదు. ఏమయినా నష్టపోతే అమూల్యే నష్టపోతుంది. అయినా కొన్ని రోజులు స్నేహంగా వుండి బంధువులమని చెప్పుకుని ఈ రోజు మనకిష్టంలేని పని చేసిందని అప్పుడు వెలివేయడం అది మన అహంకారం అవుతుంది కానీ మంచితనం కాదు."

"ఆ పిల్లాడు సరిగ్గా చూస్తాడో, చూడడో కాస్త ఆలోచించి కాదూ పెళ్ళి చేసుకోవాలి."

"చూస్తాడనే అనుకుందాం అమ్మా. మనం చేసే పెళ్ళిళ్ళన్నీ బాగుంటారనే కదూ చేస్తున్నాం. ఒకవేళ బాగలేరనుకో బాగుచేసి వాళ్ళ సంసారాన్ని కుదుట పర్చాల్సిన బాధ్యత మనం తీసుకోవచ్చుకానీ ఇలా వెలివేసి మనం సాధించేదేవిటి?"

తన భర్త జవాబుతో తనెంత సంతోషపడిందీ! ఎంత అదృష్ట వంతురాలు తను!!

అలా ఆలోచల్లో వున్న విమల గుండెల నిండా భర్త పట్ల ఆరాధన చప్పున తన పెదాలు భర్త ఛాతీమీద అన్చి ముద్దు పెట్టుకుంది విమల. అతను భార్య చేతిని అందుకుని ముద్దు పెట్టుకున్నాడు తాకీ తాకనట్లు.

కొద్దిసేపు ఆ పారవశ్యంలో మునిగిన విమల మరలా గతంలో కెళ్ళిపోయింది. ఆమె తల అసహనంగా అతని ఛాతీమీద కదిలింది.

"పాపం అమూల్య అలాంటిది కాదు. వాళ్ళు ఆమెను అతనితో అలా అన్నారు వీళ్ళు ఇతనితో అన్నారు" అని అమూల్య గురించి వాళ్ళూ, వీళ్ళూ చెప్పేవన్నీ కథలుగా చెప్పి బాధపడే తన స్నేహితులు కూడా తనని సమర్థించలేదు. ఆ పిల్లతాలూకు అపనిందల బ్రతుకుకు రక్షించను ఆమెకు ఓ తోడు, సంరక్షకుడు దొరికాడని ఆనందించలేదు.

ఎందుకని? ఎందుకని ఇలా జరిగింది? బయట ప్రపంచం ఈ పని తను చేసినందుకు తననీ సుబ్బారావును అమూల్యను కూడా ఘనంగా మెచ్చుకుంటుండగా, తమ వాళ్ళు- అమూల్య తాలూకు బంధు జనం ఆమెనల్లుకున్న జనం మాత్రం ఎందుకు హర్షించడం లేదు?

"విమలా!" అతని చేయి భార్య తలమీద పడింది.

"ఊఁ"

అతను ఆమె జుట్టులోకి వేళ్ళు పోనిచ్చాడు.

"అలా వున్నావేం విమలా?"

విమల తన గుండెల్లో ప్రశ్నను దాచుకోలేదు. భర్తముందు దానిని పరిచేసింది.

"ఎందుకని? ఎందుకని? బాగుపడ్డ ఆ పిల్ల జీవితానికి హర్షించాల్సిన వీళ్ళంతా ఎందుకు హర్షించడంలేదు?"

అతను నవ్వాడు.

పకపక నవ్వాడు.

"నాకు తెలుసు! ఇలా అవుతుందని నాకు తెలుసు" ఆమె కళ్ళు ఎత్తి అతనివేపు చూసింది-

జవాబు చెప్పమన్నట్టుగా చూసింది.

అతను ఆమె తలను మరలా గుండెలమీద ఆనించుకున్నాడు.

ఆమె వీపుమీద ఓదార్పుగా చేయి వేసాడు.

అలా పడుకునే అంది విమల....

"చెప్పండి ప్లీజ్" అని.

ఐదునిమిషాల నిశ్శబ్దం తర్వాత అతనన్నాడు-"ఆటబొమ్మ విరిగిపోయింది విమలా!"

"ఆటబొమ్మా!" తలెత్తి బాధగా చూసింది విమల.

"నిజం విమలా! అమూల్యలాటి ఆడపిల్లల జీవితాలు ఈ సమాజానికి ఆటబొమ్మలు సానుభూతి చూపించను, కదలల్లను, కాలక్షేపం జరగనూ, ఆ పిల్లకు తాము తప్ప మరేదిక్కు లేదనే ఆధిక్యతను నిరూపించుకోనూ అలాటి జీవితాలు వాళ్ళకి అవసరం. నువ్వు అన్యాయంగా ఆ పిల్లకు పెళ్ళిచేసి, ఆమె జీవితానికో సంరక్షకుణ్ణి వెతికిపెట్టి పాపం వాళ్ళ ఆటబొమ్మని విరిచేస్తివి"

విమల విస్తుపోయింది.

బాధపడింది.

"వాళ్ళందరి సంగతి వదిలేయండి. రక్తసంబంధీకులన్నా ఆపిల్ల ఆనందానికి ఆనందించాలి కదా! వాళ్ళకు చెప్పలేదని కొందరు. అందగాడు కాదని కొందరు. తమ మాట కాదన్నారని కొందరూ—చెప్పండి ఈ ప్రేమలూ. అభిమానాలూ అన్నీ అబద్ధపు విలువలేనా?"

ఆవేదనగా ప్రశ్నించింది విమల.

అతను కాస్త సర్దుకొని పడుకున్నాడు.

"లేదు విమలా! అభిమానాలు, ప్రేమలు అబద్ధంకాదు. కాకపోతే మనం మనల్ని ప్రేమించుకున్నట్టు మనవాళ్ళని ప్రేమించం. అందుకే ఈకలతలు, కార్పణ్యాలు, అభిమానాలు పట్టింపులు...."

భర్త చెప్పేదాన్ని జీర్ణించుకొనే ప్రయత్నంలో మునిగిపోయింది విమల.

*